తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
సంపుటి : 01
సంచిక : 59
పేజీలు : 4
వెల : 4
మల్కాజిగిరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
శనివారం, 09-09-2023

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
విలేకర్లు కావలెను
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me

## జీ 20 సమిట్

### హాజరుకానున్న 16 దేశాధినేతలు

### చైనా, రష్యా, స్పెయిన్, మెక్సికో నేతల గైర్హాజరు



**జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8**

ఢిల్లీలో జరగనున్న జీ 20 సదస్సుకి ప్రపంచ దేశాల అధినేతలతో పాటు కీలక నేతలు హాజరు కానున్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, యూకే ప్రధాని రిషి సునాక్‌తో పాటు మరి కొన్ని దేశాల లీడర్స్ ఢిల్లీకి తరలి వస్తున్నారు. సభ్య దేశాల అధినేతలందరికీ భారత్ ఆహ్వానం పంపినప్పటికీ కొందరు మాత్రం హాజరు కావడం లేదు. రకరకాల కారణాల వల్ల హాజరు కాలేక పోతున్నట్టు ఇప్పటికే అధికారికంగా ఆయా దేశాలు ప్రకటించాయి. వీరిలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉన్నారు. జో బైడెన్ ఇప్పటికే ఢిల్లీకి బయల్దేరినట్టు అమెరికా వెల్లడించింది. జీ20 సదస్సుకి హాజరయ్యేందుకు ఢిల్లీకి వస్తున్నట్టు మిగతా 2 లో

## జీ 20 అతిథులకు మిల్లెట్స్ వంటకాలు

### బంగారు, వెండి పాత్రల్లో భోజనం



**జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8**

జీ20 సదస్సుకు వచ్చే అతిథులకు అదిరిపోయే ఆతిథ్యం ఇవ్వబోతున్నట్లు ప్రత్యేక కార్యదర్శి ముక్తేశ్ పరదేశి తెలిపారు. స్థానిక వంటకాలతో పసందుగా విందు ఇవ్వబోతున్నట్లు ప్రకటించారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు చిరు ధాన్యాలతో కూడిన భారతీయ వంటకాల రుచి చూపిస్తామని చెప్పారు. అలాగే చిరు ధాన్యాల పౌడర్ తో ఫ్రూట్ సలాడ్లు, బెల్లం రాగి ఖీర్, స్పెషల్ మిల్లెట్ థాలి, మిల్లెట్ పలావ్, మిల్లెట్ ఇండ్లీ వంటి వంటకాలు చేయబోతున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా రాజస్థానీ దాల్ బాటీ ఖుర్మా, పశ్చిమ బెంగాల్ రసగుల్లా, దక్షిణాది మసాలా దోశ బిహార్ లిట్టీ చోకాలనూ అతిథిలకు వండి వడ్డించబోతున్నట్లు స్పష్టం చేశారు. అలాగే చాందినీ చౌక్ వంటకాలను కూడా తినిపిస్తామని స్పష్టం మిగతా 2 లో

## వివాదమవుతున్న కేయూ పిహెచ్డీ వ్యవహారం

### విద్యార్థి నేతలకు గాయాలు



**జయభేరి, వరంగల్ :**

వరంగల్ లో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ విద్యార్థుల ఆందోళన రాజకీయంగా దుమారం రేపుతుంది. పీహెచ్డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు ఆందోళన దిగి విసి, ప్రిన్సిపల్ కార్యాలయం పై దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేసిన కేసులో ఏడుగురు విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరు రిమాండ్ కు తరలించారు. అయితే విద్యార్థులు చేతులకు కాళ్ళకు కట్లు కట్టుకొని పోలీసులు కొట్టారని ఆందోళన దిగడం వివాదాస్పదంగా మారింది. విద్యార్థులను తాము కొట్టలేదని, చట్టాన్ని చేతిలో తీసుకొని దాడులు చేస్తామంటే ఊర్కోబోమని సిపి రంగనాథ్ హెచ్చరించారు. పీహెచ్డీ సీట్ల భర్తీ ప్రతిభ ఆధారంగానే జరిగిందని ఎలాంటి అవకతవకలు జరగలేదని వీసి రమేష్ స్పష్టం చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ విద్యార్థుల ఆందోళన, దాడి, పోలీసుల అరెస్టు వివాదాస్పదంగా మారింది. పీహెచ్డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని అడ్మిషన్లు రద్దుచేసి కొత్తగా షెడ్యూల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ, బిసి విద్యార్థులు మూడు రోజుల క్రితం మిగతా 2 లో




2 లో

# చుట్టూ తెలంగాణ రాజకీయాలు

సెప్టెంబర్ 17వ తేదీ వస్తుందంటే చాలు ఒక్కసారిగా తెలంగాణ రాజకీయాలు వేడెక్కుతాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు నుంచి ఈ తేదీకి ఉన్న ప్రాముఖ్యత ఏంటో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. విమోచం, విలీనం, విద్రోహం ఇలా రకరకాల పేర్లతో సెప్టెంబర్ 17 పొలిటిక్ సర్కిల్స్‌లో హాట్ హాట్‌గా మారుతుంటుంది. ఇక ఈ ఏడాది కూడా సెప్టెంబర్ 17వ తేదీ తెలంగాణ రాజకీయాల్లో కాకరేపుతోంది. ఈసారి తెలంగాణ రాజకీయాల్లో ఏకంగా జాతీయ స్థాయిలో చర్చకు కేంద్ర బిందువు కానుంది. సెప్టెంబర్ 17న కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పోటాపోటీన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి. మరీ ముఖ్యంగా తెలంగాణలో ఎన్నికలు సమీపించడంతో సెప్టెంబర్ 17న ప్రత్యేక కార్యక్రమాలకు పార్టీలు సిద్ధమవుతున్నాయి.

## ఈజీ మనీ కోసం మహిళల అడ్డదారులు

**జయభేరి, ఒంగోలు, సెప్టెంబర్ 8**

ఆ మహిళల భర్తలు మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. కుటుంబానికి సరిపడా ఆదాయం ఆర్జిస్తున్నారు. అయితే ఆ మహిళలకు విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డారు. భర్తల సంపాదన కన్నా ఈజీగా డబ్బు సంపాదించేందుకు చోరీలే మార్గాలుగా ఎంచుకున్నారు. అందుకు ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకున్నారు. రెండు సార్లు సక్సెస్ అయ్యారు. అయితే వీళ్లు చేసిన చిన్న పొరపాటు మూడోసారి పోలీసులకు చిక్కేలా చేసింది. దీంతో ప్రస్తుతం కటకటాలపాలై ఊచలు లెక్కబెడుతున్నారు.విలాసాలకు అలవాటు పడి అప్పుల పాలైన నలుగురు మహిళలు ఈజీ మనీ కోసం చోరీ చేసేందుకు సిద్ధపడ్డారు. తమ భర్తలు మంచి ఉద్యోగాలు చేస్తున్నా అవసరాలకు అవి సరిపోవడం లేదంటూ నేరాలవైపు దృష్టి సారించారు. అందుకు అనువుగా ఒంటరిగా ఉంటున్న మహిళలను టార్గెట్ చేసుకున్నారు. ఇప్పటికే ఈ తరహా నేరాలు చేసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్నారు. తాజాగా ఒంగోలు కృష్ణానగర్‌లో ఓ బ్యూటీషియన్ పగలు ఒంటరిగా ఉంటుందని, ఆమె దగ్గర బంగారం ఎక్కువగా ఉందని మరో బ్యూటీషియన్ ద్వారా వివరాలు సేకరించారు. అంతే ఎప్పటిలాగే తమ ప్లాన్ అమలు చేసేందుకు రంగంలోకి దిగిపోయారు ఈ మాయల మరాఠీలు. బ్యూటీషియన్ రజియాపై బాత్రూమ్ యాసిడ్‌తో దాడి చేసి, మత్తుమందు ఇచ్చి బంగారం, డబ్బు ఎత్తుకెళ్ళారు. అయితే ఇక్కడ ఈ మహిళలు చేసిన ఓ పొరపాటు గంటల వ్యవధిలోనే పోలీసులు పట్టుకునేలా చేసింది. దీంతో ఈ ముగ్గురి గుట్టు రట్టయింది.ఒంగోలులో కొత్త తరహా నేరాలకు తెరలేపారు నలుగురు మహిళలు. మహిళల ఆధ్వర్యంలో నిర్వహించే బ్యూటీపార్లర్లపై కన్నేశారు. అందుకు అనువుగా ఉన్న ఒంగోలు నగరంలోని కర్నూలు రోడ్డులో ఉన్న ఓ బ్యూటీపార్లర్‌ను మిగతా 2 లో



## అమెరికా భారత్ మధ్య కీలక ఒప్పందం

**జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9**

దేశ రాజధాని ఢిల్లీలో జీ20 సదస్సు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అతిథుల ఆహ్వాన దగ్గర నుంచి భద్రత, అతిథులకు అతిథ్యం వరకు అన్ని సిద్ధమయ్యాయి. శని, ఆదివారాల్లో జరిగే సదస్సుకు ప్రపంచ నేతలు ఒక్కొక్కరుగా ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. సదస్సుకు ముందే అమెరికా భారత్ మధ్య ఒక కీలక ఒప్పందం జరిగింది. జీ20 శిఖరాగ్ర సదస్సుకు ముందే ఈ ఒప్పంద నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. కొన్ని అమెరికా వస్తువులపై విధిస్తున్న అదనపు సుంకాలను ఎత్తివేయాలని భారత్ తీసుకుంది. దాదాపు 6 అమెరికా ఉత్పత్తులపై భారత్ అదనపు సుంకాలను ఎత్తివేసింది. వీటిలో సెనగలు, ఉలవలు, ఆపిల్స్, వాల్ నట్స్, బాదం ఉన్నాయి. దీనికి బదులుగా పలు ఉత్పత్తులపై భారత్ సైతం అదనపు సుంకాలు విధించింది. వాటిలో కొన్నింటికి తాజాగా మినహాయింపు ఇచ్చింది. జీ 20 చిత్ర సదస్సుకు అగ్రరాజ్య అధ్యక్షుడు జో బైడెన్ హాజరు కానున్న సందర్భంగా ఆయనతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఈ నేపథ్యంలో భారత్ తాజా నిర్ణయానికి ప్రాధాన్యం ఏర్పడింది.ప్రధాని మోదీ ఇటీవల అమెరికా పర్యటకు వెళ్ళిన విషయం తెలిసిందే. అమెరికా పర్యటన సమయంలో దాదాపు 6 అంశాల్లో నెలకొన్న వాణిజ్య వివాదాలను పరిష్కరించుకునేందుకు ఇరుదేశాలు అంగీకరించాయి. అందులో తాజాగా అదనపు సుంకాల అంశం కూడా ఉంది. 2023 24 ఇరుదేశాల మధ్య లేపాక్షిక సరుకు వాణిజ్యం 128.9 బిలియన్ డాలర్లకు చేరింది. జీ20 సదస్సు దేశ రాజధాని ఢిల్లీ ఆతిథ్యం ఇస్తుండడంతో.... దేశమంతా జీ20 పేరు మారుమోగుతోంది. ప్రధాని మోదీ అధ్యక్షతన అమెరికా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా లాంటి ప్రపంచ అగ్ర నేతలతో పాటు 40 కి పైగా దేశాల అధినేతలు ఢిల్లీలో రెండు రోజులపాటు భేటీ కానున్నారు.ప్రపంచ వేదికపై అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారత్ వారధిగా నిలవాలన్న లక్ష్యంతో జీ20 అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రపంచ వేదికపై భారత్ ఛాంపియన్ గా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు జీ20 అధ్యక్ష బాధ్యతలు స్వీకరించే సమయంలో ప్రధాని మోదీ ఈ విధంగా వ్యాఖ్యానించారు. ఇందులో భాగంగా వివిధ దేశాలతో పలు కీలక ఒప్పందాలు చేసుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ సదస్సులకు కేవలం ఆర్థిక అంశాలే ప్రధానంగా ఏర్పడింది కాబట్టి... తొలుత జీ20 దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంకుల గవర్నర్ మాత్రమే ప్రతి సంవత్సరం భేటీకి హాజరయ్యేవారు. కానీ 2008 ఆర్థిక సంక్షోభం అనంతరం ఈ సదస్సును సభ్య దేశాల దేశాధినేతల స్థాయికి పెంచారు. ఏటా జి20 సభ్య దేశాల అధినేతలు శిఖరాగ్ర సదస్సు నిర్వహించి చర్చిస్తుండగా... ఆర్థిక మంత్రుల భేటీ లు ప్రతి ఏటా రెండుసార్లు జరుగుతున్నాయి. తలుత ఆర్థిక అంశాలకే పరిమితమైన జీ 20 తర్వాత వాణిజ్యం, ఇంధనం, వాతావరణ మార్పులు, ఉగ్రవాదం పైన చర్చించడం ఆరంభించింది. ప్రస్తుతం ఢిల్లీ ఈ సదస్సు సిద్ధమవుగా ప్రపంచ దేశాలు ప్రస్తుతం భారత వైపు చూస్తున్నాయి.

## హోంగార్డు మృతి..

### అధికారుల వార్నింగ్

2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

# జీ 20 సమిట్

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వెల్లడించారు. ఉక్రెయిన్‌లో యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఎలాంటి ప్రభావం పడిందనే అంశంపై భారత్‌తో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. దీంతో పాటు వాతావరణ మార్పులు, పేదరిక నిర్మూలన అంశాలపైనా చర్చించనున్నారు. యూకే ప్రధాని రిషి సునాక్ ఈ జీ20 సదస్సుకి హాజరు కానున్నట్టు అధికారికంగా ప్రకటించారు. భారత సంతతికి చెందిన ఆయన...బ్రిటన్ ప్రధాని అయ్యాక ఇండియాకి రావడం ఇదే తొలిసారి. జపాన్ ప్రధాని ఫుమియో కిషిద కూడా జీ20 సమావేశానికి వస్తున్నట్టు తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా పాల్పడుతున్న సైనిక చర్యను ఈ వేదికగా తీవ్రంగా ఖండించేందుకు సిద్ధంగా ఉన్నట్టు స్పష్టం చేశారు. రష్యాఉక్రెయిన్ యుద్ధంపై చర్చించడమే ప్రధాన అజెండాగా పెట్టుకున్నారు.కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రస్తుతానికి ఇండోనేషియా పర్యటనలో ఉన్నారు. అయినా...జీ20 సదస్సుకి హాజరవుతానని ప్రకటించారు. ప్రధాని కార్యాలయం కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. .ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ కూడా ఈ సదస్సుకి వస్తున్నారు. కేవలం జీ20 సమావేశాలే కాదు...ప్రత్యేకంగా ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలూ జరపనున్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని అల్బనీస్ మూడు దేశాల్లో పర్యటించనున్నారు. ఇండియా, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్ పర్యటనకు ప్లాన్ చేసుకున్నారు. ఇందులో భాగంగానే భారత్‌లోని జీ20 సదస్సుకి హాజరు కానున్నారు. జర్మన్ ఛాన్స్‌లర్ ఒలఫ్ షోల్‌జ్‌తో పాటు దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ కూడా జీ20 సమావేశాలకు హాజరు కానున్నారు.

**నాలుగు దేశాధినేతల గైర్హాజరు**

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ జీ20 సమావేశాలకు హాజరు కావడం లేదని ప్రకటించింది చైనా. ఆయనకు బదులుగా ఆ దేశానికి ప్రతినిధిగా కీలక నేత లీ క్వియాంగ్ రానున్నారు. 2008లో తొలిసారి జీ20 సమావేశం జరిగింది. అప్పటి నుంచి ఎప్పుడు సదస్సు జరిగినా చైనా అధ్యక్షుడు హాజరయ్యారు. చైనా ప్రెసిడెంట్ రాకపోవడం ఇదే తొలిసారి. రష్యా ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చాలా సార్లు మాట్లాడారు ప్రధాని మోదీ. ఆ తరవాత చాలా పరిణామాలు జరిగాయి. ఉక్రెయిన్‌పై సైనిక చర్యలకు పాల్పడినందుకు పుతిన్‌పై అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయింది. విదేశాలకు వెళ్తే అరెస్ట్ అయ్యే అవకాశాలున్నాయన్న వాదనల నేపథ్యంలో ఆయన ఇండియాలోని జీ20 సదస్సుకి హాజరు కావడం లేదని ప్రకటించారు. స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాన్‌షెజ్‌కి కరోనా సోకింది. అందుకే జీ20 సదస్సుకి హాజరు కాలేకపోతున్నానని వెల్లడించారు. మెక్సికో అధ్యక్షుడు యాండ్రెస్ మాన్యుయెల్ లోపెజ్ ఆబ్రడార్ కూడా హాజరు కావడం లేదు.

**రాష్ట్రపతి ప్రత్యేక విందు**

కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ మల్లికార్జున్ ఖర్గేకి జీ20 విందుకి ఆహ్వానం అందకపోవడం రాజకీయంగా చర్చకు దారి తీసింది. జీ 20 సదస్సు నేపథ్యంలో సెప్టెంబర్ 9న రాష్ట్రపతి విందు ఇవ్వనున్నారు. అయితే...రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఖర్గేకి ఆహ్వానం అందలేదని కాంగ్రెస్ వెల్లడించింది. పార్టీ అధ్యక్షుడి హోదాలో ఉన్న ఆయనకే ఇన్విటేషన్ రాకపోవడం అలజడి సృష్టించింది. అయితే...ఖర్గే ఒక్కరినే కాదని, మరే ఇతర పార్టీలకు చెందిన నేతల్నీ ఈ విందుకి ఆహ్వానించలేదని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కేవలం మంత్రులు, ముఖ్యమంత్రులకు మాత్రమే ఆహ్వానం అందిందని సమాచారం. మాజీ ప్రధానమంత్రులైన డాక్టర్ మన్మోహన్ సింగ్, హెచ్‌డీ దేవెగౌడనూ ఆహ్వానించారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కే స్టాలిన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కి ఆహ్వానం పంపారు. ఈ విందుకి హాజరవుతున్నట్టు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ వెల్లడించారు. పార్లమెంట్ హౌజ్‌లో సాయంత్రం 6 గంటలకు విందు ఏర్పాటు చేయనున్నారు. పార్లమెంట్ హౌజ్‌కి గెస్ట్‌లందరినీ సేఫ్‌గా తీసుకొచ్చేందుకు పెద్ద ఎత్తున భద్రతా ఏర్పాట్లు చశారు ఢిల్లీ పోలీసులు. భారత్ మండపంలోని మల్టీ ఫంక్షన్ హాల్‌లో ఈ విందు జరగనుంది. ఇదే సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలూ జరగనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ అతిథులందరినీ ప్రత్యేకంగా ఆహ్వానించనున్నారు. మొత్తం 40 మందికిపైగా ప్రతినిధులు హాజరు కానున్నారు.

# జీ 20 అతిధులకు మిల్లెట్స్ వంటకాలు

చేశారు. భారత్ సెప్టెంబరు 9, 10 తేదీల్లో జీ20 సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరిగే సమ్మిట్‌కు ప్రపంచ స్థాయి నాయకులు, విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నారు. అందు కోసం ఢిల్లీలోని హోటళ్లు ప్రత్యేకమైన రీతిలో వివిఐపిలకు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధమవుతున్నాయి. దేశాధినేతలు, ఇతర ప్రపంచ నాయకులకు వెండి, బంగారు పూత పూసిన పాత్రల్లో భోజనం అందించనున్నారు. భారత దేశం సంస్కృతి, ప్రతిబింబించేలా వెండి, బంగారు పూత పూసిన పాత్రల్లో భోజనం, ఆతిథ్యం అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అతిథులకు విలాసవంతమైన విందు కోసం వివిధ లగ్జరీ హోటళ్లలో ఈ వస్తువులను ఏర్పాటు చేశారు. అత్యంత ఆకర్షణీయమైన, అందమైన పాత్రలను ఐకానిక్ ITC తాజ్ హోటల్‌తో సహా 11 హోటళ్లకు పంపేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందు కోసం క్రోకరీ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భగా పాత్రల తయారీ సంస్థ యజమానులు రాజీవ్, అతని కుమారుడు మాట్లాడుతూ.. తాము మూడు తరాలుగా ఈ పాత్రలను తయారు చేస్తున్నట్లు చెప్పారు. విదేశీ సందర్శకులకు తమ డైనింగ్ టేబుల్‌లపై భారతదేశ రుచిని అందించడమే తమ లక్ష్యం అని చెప్పారు. ఈ పాత్రలు జైపూర్, ఉదయపూర్, వారణాసి, కర్నాటకలో కళాత్మకంగా రూపొందించినట్లు చెప్పారు. ఇవి భారతదేశంలోని విభిన్న సంస్కృతులను ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఈ పాత్రలపై మేక్ ఇన్ ఇండియా అని ఉంటుంది. ఇవి దేశంలోని హస్తకళకు ప్రతిరూపంగా నిలుస్తాయి. ఐరిస్ కంపెనీ ప్రకారం, జీ20 సమ్మిట్ కోసం 11 హోటళ్లకు ప్రత్యేకమైన పాత్రలను పంపుతున్నారు. ఈ పాత్రలు తయారైన తరువాత ప్రతి భాగం R&D ల్యాబ్‌లో క్షుణ్ణంగా పరీక్షించారు. హోటళ్ల నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా ఈ పాత్రలు రూపొందించబడ్డాయి. 'మహారాజా తాలీ' తరహాలో ఉప్పు, పెప్పర్ కోసం ప్రత్యేక వెండి గిన్నెలు, అన్నీ హోటల్ మెనూ, శైలికి సరిపోయేలా 56 గిన్నెలను కలిగి ఉండేలా పాత్రల సెట్లు రూపొందించబడ్డాయి. ఈ పాత్రల సెట్లు భారతదేశం గొప్ప వారసత్వానికి ప్రతీకగా నిలవనున్నాయి. జాతీయ పక్షి నెమలిని కూడా కంపెనీ తన డిజైన్‌లో చేర్చింది. ఇది తరచుగా అతిథుల నుంచి ప్రశంసలను పొందుతుంది. మహారాజా తాలీతో పాటు, దక్షిణ భారతదేశానికి చెందిన డిజైన్‌లను కూడా సేకరణలో పొందుపరిచారు. వివిధ హోటళ్లు వారి ప్రత్యేకమైన మెనుల ఆధారంగా తమ పాత్రల డిజైన్‌లను రూపొందించారు.

# కేయూ పిహెచ్డీ వ్యవహారం

ఆందోళన దిగారు. ఆందోళనలో భాగంగా విసి, ప్రిన్సిపల్ కార్యాలయంలోకి దూసుకెళ్లి పర్నిచర్ ద్వంసం చేశారు. అక్కడే ఉన్న పోలీసులు దాడి చేసిన వారిపై చేయి చేసుకుని బలవంతంగా స్టేషన్ తరలించారు. మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచగా ఏబీవీపీ విద్యార్థులు సిపి పర్యవేక్షణలో టాస్కోఫ్ఫర్స్ పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి కొట్టారని మెజిస్ట్రేట్ ముందు చెప్పారు. మెజిస్ట్రేట్ మళ్ళీ వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించడంతో పోలీసులు ఎంజీఎం కు తరలించి వైద్య పరీక్షలు చేయించారు. కట్లు చూసి పోలీసులు బాగానే కొట్టి ఉంటారని గాయపడ్డ వారికి సంఘీభావంగా కేయు విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులు యూనివర్సిటీ లో ఆందోళనకు దిగారు. విద్యార్థులను కొట్టి తేనె తెట్టేను తట్టి లేపారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆందోళన, రాజకీయ పార్టీల ఆగ్రహంతో వైస్ ఛాన్సలర్ తాటికొండ రమేష్, పోలీస్ కమిషనర్ ఏవి రంగనాథ్ మీడియా ముందుకు వచ్చారు. విద్యార్థులను కొట్టలేదని, వారు చేసే ఆరోపణలో వాస్తవం లేదని సిపి రంగనాథ్ స్పష్టం చేశారు. నేను దగ్గరుండి టాస్క్ ఫోర్స్ పోలీసులచే కొట్టించానని, గన్ పెట్టి బెదిరించానని చెప్పడం అబద్దమన్నారు. కొంతమంది ఏబీవీపీ విద్యార్థులు వీసీ చాంబర్ డోర్ పగలగొట్టి, కంప్యూటర్లు ధ్వంసం చేయడంతో అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకునే క్రమంలో తోపులాట జరిగిందని తోపులాటలో స్వల్ప గాయాలు అయ్యాయే తప్ప తాము విద్యార్థులను కొట్టలేదన్నారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుని దాడులు చేస్తే ఊరుకోబోమని ముందే హెచ్చరించినా విద్యార్థులు పట్టించుకోలేదన్నారు. కేయూలో తప్పులు జరిగితే ప్రశ్నించాలి, లీగల్ గా పోరాడాలి, కానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు చేస్తామంటే చూస్తు ఊర్కోబోమని సిపి హెచ్చరించారు. కేయూ పిహెచ్డీ కేటగిరి2 అడ్మిషన్ లలో ఎలాంటి అవకతవకలు జరగలేదని వైస్ ఛాన్సలర్ తాటికొండ రమేష్‌స్పష్టం చేశారు. పారదర్శకంగా ప్రతిభ ఆధారంగానే అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగించామని చెప్పారు. విద్యార్థుల ఆందోళన, అరెస్టు, గాయాలు, పోలీసులపై విమర్శలు, విసిపై ఆరోపణలు వివాదాస్పదమై రాజకీయంగా హాట్ టాపిక్ గా మారాయి.

# 17 చుట్టూ తెలంగాణ రాజకీయాలు

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 8**

సెప్టెంబర్ 17వ తేదీ వస్తుందంటే చాలు ఒక్కసారిగా తెలంగాణ రాజకీయాలు వేడెక్కుతాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు నుంచి ఈ తేదీకి ఉన్న ప్రాముఖ్యత ఏంటో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. విమోచం, విలీనం, విద్రోహం ఇలా రకరకాల పేర్లతో సెప్టెంబర్ 17 పొలిటిక్ సర్కిల్‌స్‌లో హాట్ హాట్‌గా మారుతుంటుంది. ఇక ఈ ఏడాది కూడా సెప్టెంబర్ 17వ తేదీ తెలంగాణ రాజకీయాల్లో కాకరేపుతోంది. ఈసారి తెలంగాణ రాజకీయాల్లో ఏకంగా జాతీయ స్థాయిలో చర్చకు కేంద్ర బిందువు కానుంది. సెప్టెంబర్ 17న కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పోటాపోటీన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి.మరీ ముఖ్యంగా తెలంగాణలో ఎన్నికలు సమీపించడంతో సెప్టెంబర్ 17న ప్రత్యేక కార్యక్రమాలకు పార్టీలు సిద్ధమవుతున్నాయి. అగ్రనాయకుల సభలకు కాంగ్రెస్ బీజేపీ నేతలు ప్లాన్ చేయడంతోరాజకీయం వేడెక్కింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడడటంతో సెప్టెంబర్ 17న బీజేపీకాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా కార్యక్రమాలకు ప్లాన్ చేస్తున్నాయి. ఈ నెల 16, 17 తేదీల్లో CWC సమావేశాలు నిర్వహించేందుకు తెలంగాణ PCC సిద్ధమవుతోంది. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో పాటు కాంగ్రెస్ అగ్ర నాయకులు, ప్రతినిధులు, ఇతర నాయకులు కలిపి దాదాపు 3 వందల మంది హాజరయ్యే అవకాశం ఉందని పీసీసీ అంచనా వేస్తోంది. ఆ స్థాయిలో ఏర్పాట్లపై PCC ఫోకస్ పెట్టింది.మరోవైపు సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ బీజేపీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభకు కమలం పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం తమ తమ పోలింగ్ బూతుల్లో జాతీయ జెండా ఆవిష్కరించి..సాయంత్రం సభకు వచ్చే విధంగా బీజేపీ నేతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ ఏడాది కూడా సెప్టెంబర్ 17న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపులో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.ఇదిలా ఉంటే మరోవైపు అధికార పార్టీ బీఆర్ఎస్ కూడా ఈ విషయంలో తగ్గేదేలే అన్నట్లు దూకుడు ప్రదర్శించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఈసారి కేసీఆర్ రూటు మార్చారు. బీజేపీ, కాంగ్రెస్‌ల ఎత్తుగడలకు చెక్ పెట్టేలే సెప్టెంబర్ 16వ తేదీన భారీ బహిరంగ సభ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని నిర్ణయించిన బీఆర్ఎస్ పార్టీ అదే రోజు భారీ బహిరంగ సభను నిర్వహించాలని చూస్తోంది. దీంతో తెలంగాణ రాజకీయాల్లో సెప్టెంబర్ 17 మరోసారి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారనుంది.

**ఐదు హామీలు ప్రకటించనున్న సోనియా**

తెలంగాణ వచ్చేది కాంగ్రెస్సేనని, ప్రతి ఒక్కరు కూడా కష్టపడి పని చేయాలని, అందరు సమన్వయంతో మెలగాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ సూచిచారు. బుధవారం రాత్రి తాజ్‌కృష్ణా హోటల్‌లోని రేవంత్ రెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా పలువురు నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ నేతలకు పలు సూచనలు, సలహాలు చేశారు. రాత్రి 10 గంటల దాకా జరిగిన ఈ సమావేశంలో ఈ నెల 16వ తేదిన నిర్వహించనున్న సీడబ్ల్యూసీ సమావేశాన్ని.. 17వ తేదిన జరిగే బహిరంగ సభలపై కూడా కేసీ వేణుగోపాల్ మాట్లాడారు. అలాగే సీడబ్ల్యూసీ సమావేశానికి పార్టీ జాతీయ నేతలందరు హాజరవుతున్న తరుణంలో దీన్ని సవాల్‌గా తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్ర నేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలతో సహా పలువురు నేతలు రానున్నారని అన్నారు. వీళ్లు 16,17వ తేదీల్లో హైదరాబాద్‌లోనే ఉంటారని, సభ నిర్వహణకు పార్టీ నేతలతో ఆహార, రవాణా, సమన్వయ తదితర కమిటీలను ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే వీటికి నేతలు మధుయాస్కీ, మహేష్ గౌడ్ తదితరులు నాయకత్వం వహించాలని సూచించారు. సభకు ప్రతి మండలం నుంచి కూడా అధిక సంఖ్యలో జనాలు వచ్చేలా ప్లాన్ చేయాలన్నారు. కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి వస్తే..5 హామీలపై గ్యారంటీ పత్రాన్ని బహిరంగ సభలో సోనియా గాంధీ విడుదల చేస్తారని అన్నారు. ఈ గ్యారంటీ హామీలను, బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల గురించి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారాలు చేయాలని సూచించారు. అందరి ఐక్యతతో విజయం సాధించవచ్చని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అలాగే సెప్టెంబర్ 18న పార్టీ జాతీయ నేతలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తారని, ఆయా ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తారని అన్నారు. మరోవైపు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కూడా తాజ్‌కృష్ణ హోటల్‌లో.. వేణుగోపాల్, రేవంత్ సహా తదితర నేతలతో చర్చలు జరిపారు. వామపక్షాలకు ఎన్ని సీట్లు ఇవ్వాలనే దానిపై కూడా చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ఈనెల 17న నిర్వహించనున్న బహిరంగ సభ కోసం మైదానం ఎంపిక చేసేందుకు కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అయితే సభకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ ఇవ్వాలని.. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ నెల 2వ తేదీన కాంగ్రెస్ పార్టీ దరఖాస్తు చేసుకుంది తెలంగాణ కాంగ్రెస్. బీజేపీ కార్యక్రమం ఉండటం వల్ల తమకు ఇస్తారో.. లేదోనన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. చివరికి ఎల్బీ స్టేడియంలో సభను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది.

# ఎట్టి పరిస్థితిలో అక్రమాలను సహించేది లేదు

- తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక పాలసీ దేశంలోనే బెస్ట్.
- పారదర్శకత కోసం ఈ - వేలం
- ప్రభుత్వానికి ఆదాయం పెంచే ప్రణాళికలు సిద్ధం చేయండి
- ఖాళీగా ఉన్న 127 పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- లీజులలో ఉండి ఆపరేషన్ లో లేని గనులను క్రియా శీలకం చేయాలి
- జిల్లాల వారీగా మినరల్ రెవెన్యూ పెంచాలి
- సమీక్షలో మంత్రి డాక్టర్ మహేందర్ రెడ్డి




**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 8 :**


తెలంగాణ రాష్ట్రంలో అమలు పరుస్తున్న ఇసుక పాలసీ దేశంలోనే బెస్ట్ అని, ఇతర రాష్ట్రాలు అనుసరించే విధంగా ఉన్నాయని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గనుల శాఖ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. గనులు, భూగర్భ వనరుల శాఖ పై ఉన్నతాధికారులతో శుక్రవారం డా.బి.ఆర్. ఆంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, గనుల శాఖ డైరెక్టర్ కాత్యాయని, టీఎస్ఎండీసీ ఎండీ మల్సూర్, ఉన్నతాధికారులు పాల్గొన్న సమావేశంలో ఆయన గనులు, భూగర్భ శాఖ పనితీరు చర్చించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో అమలులో ఉన్న మైనింగ్, క్వారీ లీజులు, రెవెన్యూ వసూలు అంశాలతో పాటు ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యం ఎంతవరకు నెరవేరిందని తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల నూతనంగా తీసుకువచ్చిన ఖనిజ బ్లాక్ ల వేలంలో భాగంగా వేలం వేయడానికి పొందిన పర్యావరణ అనుమతుల తో పాటు స్థాపన, ఆపరేషన్ కొరకు పొందిన అనుమతులను గురించి వాకబు చేసి వీటిని వేగవంతం చేయాలని ఆదేశించారు.

రాష్ట్రంలో 2014 ఆర్థిక సంవత్సరం నుండి ఇప్పటి వరకు శాఖ సాధించిన విజయాలు ప్రగతికి తోడ్పాటుగా ఉంటాయని అన్నారు. గనుల శాఖ దేశంలోనే అద్వితీయ ప్రగతి సాధించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2267 కోట్ల ఆదాయ లక్ష్యం నిర్దేశించగా రూ.3884 కోట్లు ఇప్పటి వరకు సమకూరడం పై అభినందిస్తూ మరింత పటిష్టంగా పనిచేసి లక్ష్యాలను సాదించాలని చెప్పారు. గనులు, చిన్న తరహా మైనింగ్ లీజ్ లపై ఇంకనూ మంచి విధానం అమలవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రజానికానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి అవసరమైన ఇసుకను సరసమైన ధరలకు అందించాలని అధికారులకు సూచించారు. గనుల శాఖలో ఖాళీగా ఉన్న 127 పోస్టుల భర్తీ చేసేందుకు ప్రతిపాదనలు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు దృష్టికి తెస్తామని తెలిపారు. సాంకేతికతను అనుసంధానం చేసి గనులు, భూగర్భ వనరుల శాఖను మరింత బలోపేతం చేయడానికి అన్ని విధాలుగా ప్రయత్నం చేస్తామని వివరించారు. గనుల నిర్వహణలో పారదర్శకత కోసం ఇసుకను ఆన్లైన్ విధానం ద్వారా అమ్మేందుకు పటిష్టమైన ఏర్పాట్లు ఉన్నాయని వాటిని మరింత మెరుగైన విధంగా అమలు చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితిలో అక్రమాలను సహించేది లేదని స్పష్టం చేశారు. టీఎస్ఎండిసి సంస్థ దేశంలో పలు అవార్డులను తెచ్చుకోవడం అభినందనీయమని కొనియాడారు. రాష్ట్రంలో 101 రీచ్ ల ద్వారా ఇసుకను సరఫరా చేస్తున్నామని, 400 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని వెల్లడించారు. పట్టా భూముల్లో ఉన్న ఇసుక తదితరాల తవ్వకాలకు అనుమతులు వేగవంతం చేసేందుకు అన్ని జిల్లా కలెక్టర్లకు లేఖలు వ్రాయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం అన్నీ జిల్లాలలో ఇసుక కొరత లేకుండా లభ్యత ఉండాలని ఆదేశించారు. టీఎస్ఎండీసీ సాధ్యమైనంత ఎక్కువ ఇసుక రీచులు ఆపరేషన్ లో తేవాలని సూచించారు. ఇసుక రీచ్‌లు అందుబాటులో లేని జిల్లాలపై ఎక్కువ దృష్టిని పెట్టాలని తెలియజేశారు. ప్రభుత్వానికి మరింత ఆదాయాన్ని పెంచాలని తెలియజేశారు. సమీక్షలో ఆయా జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హోంగార్డు మృతి.. అధికారుల వార్నింగ్

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 8**





ఆత్మహత్యాయత్నం చేసుకొని అపోలో డీఆర్డీఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు రవీందర్ ఈ ఉదయం మృతి చెందారు. 70శాతానికి పైగా కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవీందర్.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. అయితే ఉన్నతాధికారుల వేధింపులు వల్లే తాను ఆత్మహత్య చేసుకున్నట్లు మరణ వాంగ్మూలం కూడా ఇచ్చారు. ఈక్రమంలోనే పోస్టుమార్టం నిమిత్తం రవీందర్ మృతదేహాన్ని ఉస్మానియా మోర్చరీకి తరలించారు. హోమ్ గార్డు రవీందర్ మృతితో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హోమ్ గార్డులకు అధికారుల వార్నింగ్ ఇచ్చారు. హోమ్ గార్డులు అందరూ డ్యూటీలో తప్పనిసరిగా ఉండాలని సూచించారు. డ్యూటీ లో లేని హోమ్ గార్డులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ లోనే ఉండాలని చెప్పారు. వీరంతా అందుబాటులో ఉండేలా ఇన్స్పెక్ట ర్లు చర్యలు తీసుకోవాలని.. లా అండ్ ఆర్డర్ లో పనిచేసే వారు సమ్మెకు పూనుకుంటే విధుల నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. హోంగార్డు రవీందర్ చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. గత రెండు నెలల నుంచి రవీందర్‌కు జీతాలు రావడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు ఏర్పడడంతో పలుమార్లు ఉన్నతాధికారులను కలిసి జీతం గురించి, ఆర్థిక పరిస్థితి గురించి వివరించాడు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెందిన రవీందర్ గోషామహల్‌లోని హోంగార్డుల హెడ్ ఆఫీస్ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. చుట్టుపక్కల గమనించి మంటలను ఆర్పివేశారు. రవీందర్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. రవీందర్‌కు 60 శాతానికి పైగా గాయాలు అయినట్లు వైద్యులు తెలిపారు. పరిస్థితి మరింత విషమించడంతో కాంచన్ బాగ్ లోని అపోలో డీఆర్డీఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఊపిరితిత్తులు దెబ్బతినడంతో వెంటిలేటర్ ద్వారా వైద్యులు కృత్రిమ శ్వాస అందించారు. పరిస్థితి మరింత విషమించడంతో శుక్రవారం ఉదయం అతడు మృతి చెందాడు.

# తీన్మార్ మల్లన్న కొత్త పార్టీ..?

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 8**



తెలుగు రాష్ట్రాల్లో రెండు కొత్త రాజకీయ పార్టీలు రాబోతున్నాయి. తెలంగాణ ఒకటి, ఏపీలో మరో పార్టీ... కేంద్ర ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నాయి. తెలంగాణ నిర్మాణ పార్టీ పేరుతో తీన్మార్ మల్లన్న ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ పేరుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే...ఈ నెల 20లోగా తెలియజేయాలని ఈసీ వెబ్ సైట్ లో తెలియజేసింది. సెక్షన్ 29ఎ పీపుల్స్ రెప్రజంటేషన్ చట్టం ప్రకారం....పార్టీని రిజిస్టర్ చేస్తున్నట్లు ఈసీ ప్రకటించింది. అటు క్రిష్ణ జిల్లా కంచికర్లకు వ్యక్తి...తెలుగు రాజ్యాధికార పార్టీ పేరుతో ఈసీకి దరఖాస్తు చేసుకున్నారు. ఆరు జాతీయ పార్టీలు, తెలంగాణలో నాలుగు గుర్తింపు పార్టీలతో పాటు 107 గుర్తింపు లేని పార్టీలు ఉన్నాయి. 70 పార్టీలు ఎన్నికల సంఘంలో రిజిస్టర్ చేసుకున్నాయి. తీన్మార్ మల్లన్న ..కొత్త పార్టీ పెడుతున్నట్లు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. గత ఏప్రిల్ లో పార్టీ పేరును రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తీన్మార్ మల్లన్న ప్రకటించారు. త్వరలో తమ పార్టీకి ఎన్నికల సంఘం గుర్తింపు లభిస్తుందన్న తీన్మార్ మల్లన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న మేడ్చల్ నియోజకవర్గంలో బరిలోకి దిగనున్నట్లు తీన్మార్ మల్లన్న తెలిపారు. తెలంగాణ నిర్మాణ పార్టీ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని ప్రకటించారు. తాము కేసీఆర్ కు మాత్రమే వ్యతిరేకమని...ప్రతిపక్ష పార్టీలకు కాదని స్పష్టం చేశారు. తమతో కలిసి పని చేసేందుకు ఏ ప్రతిపక్ష పార్టీ ముందుకు వచ్చినా...స్వాగతిస్తామన్నారు. తీన్మార్ మల్లన్న అసలు పేరు చింతపండు నవీన్ కుమార్. 2015లో నల్గొండ ఖమ్మం -వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2019లో జరిగిన హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం స్థానానికి జరిగిన ఉపఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2021 మార్చిలో నల్గొండ -ఖమ్మం-వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

# ఈజీ మనీ కోసం మహిళల అడ్డదారులు

ఎన్నుకున్నారు. ఈ బ్యూటీ పార్లర్ నిర్వహిస్తోంది రజియా అనే ఒక మహిళగా నిర్ధారించుకున్నారు. రజియా భర్త ఉద్యోగానికి బయటకు వెళితే తిరిగి సాయంత్రమే ఇంటికి వస్తారని, ఇంట్లో ఇక ఎవరూ ఉండరని ముందుగానే పథకం ప్రకారం తెలుసుకున్నారు. ఈ సమాచారం ఇచ్చింది కూడా మరో బ్యూటీపార్లర్ నడుపుతున్న దాసరి భాను అనే మహిళే. ఈ ప్రకారం తమ ప్లాన్ అమలు చేసేందుకు రంగంలోకి దిగారు ఆ నలుగురు. చోరీకి ప్లాన్ చేసింది దాసరి భాను అనే బ్యూటీషియన్ అయితే ఆ ప్లాన్ను అమలు చేసేందుకు మరో ముగ్గురు మహిళలు యాక్షన్‌లో దిగారు.ఆ ముగ్గురు మహిళలు. మేకప్ చేయించుకుంటామంటూ రజియా నిర్వహించే బ్యూటీపార్లర్‌లోకి ఆ ముగ్గురు మహిళలు వచ్చారు. వీరిలో ఒకరు ఫేషియల్ చేయించుకున్నారు. మరో మహిళ ఐ బ్రోస్ చేయించుకున్నారు. ముగ్గురిలో ఓ మహిళ తాను బాత్రూంకు వెళ్ళింది. బాత్రూమ్ నుంచి బయటకు వస్తూనే ఆ మహిళ తన వెంట తెచ్చుకున్న యాసిడ్‌తో రజియాపై దాడి చేసింది. యాసిడ్ దాటిలో రజియాకు స్వల్ప గాయాలయ్యాయి. యాసిడ్ ముఖంపై పడటంతో గాయాలపాలైన రజియాను పట్టుకున్న మరో ఇద్దరు మహిళలు ఆమె ముఖంపై క్లోరోఫాం మత్తు మందు కలిపిన కర్చీఫ్‌తో అదిమిపెట్టారు. అయితే రజియా ప్రతిఘటిచడంతో ఆమె నోట్లో యాసిడ్ పోసేందుకు ప్రయత్నించారు. అనంతరం రజియాను ముగ్గురు మహిళలు నిర్బంధించి బీరువాలో ఉన్న 18 సవర్ల బంగారు ఆభరణాలు, అలాగే కౌంటర్లో ఉన్న 40 వేల నగదు తీసుకుని ముగ్గురు పరారయ్యారు. ఆ తరువాత కొద్ది సేపటికి స్పృహ కోల్పోయిన రజియాను గుర్తించిన స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఒంగోలు తాలూకా సీఐ భక్తవత్సల రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిందితుల్ని గుర్తించేందుకు సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీలను సేకరించారు. నిందితులైన ముగ్గురు మహిళల ఆచూకీని కనిపెట్టేందుకు ప్రయత్నించే క్రమంలో ఈ ముగ్గురు మహిళా నిందితుల గురించిన క్లూ పోలీసులకు లభించింది. అసలు ఈ ముగ్గురు మహిళలు మరో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న దాసరి భాను అనే మహిళ ఇచ్చిన రిఫరెన్స్‌తో బాధితురాలు రజియా దగ్గరకు వచ్చినట్టు తెలుసుకున్నారు. బ్యూటీషియన్ దాసరి భానును అదుపులోకి తీసుకోవడంతో ఈ ముగ్గురు నిందితుల ఆచూకీ తెలిసిపోయింది. దీంతో నేరం జరిగిన 24 గంటల్లోనే నిందితులైన ముగ్గురు మహిళలు ముండ్రు లక్ష్మి నవత @ నవ్య, కరణం మోహన దీప్తి @ దీప్తి, అలహరి అపర్ణ లతో పాటు ఈ చోరీకి ప్లాన్ చేసిన మరో బ్యూటీషియన్ దాసరి భానును పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితుల భర్తలు మంచి ఉద్యోగాలు చేస్తుండటం గమనార్హం. అయినా ఈ ముగ్గురు విలాసాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్నారని గుర్తించారు. వీరిని అరెస్ట్ చేయడంతో గతంలో చేసిన నేరాల చిట్టా కూడా బట్టబయలైంది. నిందితుల నుంచి 10 సవర్ల బంగారు నగలు, 40 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పి మలికగార్గ్ తెలిపారు.ఒంగోలులో కలకలం సృష్టించిన బ్యూటీపార్లర్ నిర్వాహకురాలిపై దాడి, చోరీ కేసును పోలీసులు 24 గంటల్లో ఛేధించి నలుగురు మహిళా నిందితులను అరెస్ట్ చేయడంతో పోలీసు సిబ్బందిని ఎస్పి మలికగార్గ్ అభినందించారు. నేరం జరిగిన ప్రాంతంలో లభించిన సిసి కెమెరా ఫుటేజ్, సాంకేతిక సమాచారంతో సేకరించిన ఇతర ఆధారాలతో నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చోరీకి గురైన సొత్తును రికవరీ చేసిన పోలీసు సిబ్బందికి ఎస్పి రివార్డులు అందించారు.

# టీఎస్ఆర్టీసీ మహిళా ప్రయాణికుల రాఖీ లక్కీ డ్రా

- 33 మంది విజేతలకు ఘన సన్మానం
- ప్రతి దసరా, సంక్రాంతి, ఉగాదితో పాటు ముందస్తు రిజర్వేషన్ ప్రయాణికులకి లక్కీ డ్రా నిర్వహిస్తాం: సంస్థ ఎండీ వీసీ సజ్జనర్

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) రాఖీ పౌర్ణమి లక్కీ డ్రా విజేతలకు నగదు పురస్కారాల ప్రదానోత్సవం హైదరాబాద్ లోని ఎంజీబీఎస్ ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సంస్థ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు శుభాభినందనలు తెలియజేశారు. సంస్థ ఉన్నతాధికారులతో కలిసి 33 మంది విజేతలకు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు మాట్లాడుతూ.. రాఖీ పండుగ సందర్భంగా మహిళల కోసం ఆగస్టు 30, 31 తేదిల్లో రాష్ట్రవ్యాప్తంగా లక్కీ డ్రా ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రతి రీజియన్ లో ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ రూ.15 వేలు, తృతీయ రూ.10 వేల చొప్పున మొత్తం రూ.5.50 లక్షల నగదు బహుమతులను అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ రాఖీ పౌర్ణమి లక్కీ డ్రాకు అనూహ్య స్పందన వచ్చిందని, దాదాపు 3 లక్షల మంది మహిళా ప్రయాణికులు ఈ లక్కీ డ్రాలో పాల్గొన్నారని చెప్పారు. ఒక మంచి కార్యక్రమంలో పాల్గొని విజేతలను సన్మానించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. విజేతలలో గృహిణులు, ఉపాధ్యాయినీలు ఎక్కువగా ఉన్నారని, వారంతా 10 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వరకు ప్రయాణం చేస్తూ.. ఆర్టీసీ బస్సుతో అనుబంధం కలిగి ఉండటం హర్షణీయమన్నారు. రాఖీ పౌర్ణమి నాడు రికార్డు స్థాయిలో రూ.22.65 కోట్ల ఆదాయం సమకూరిందని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఒక్క రోజులో ఇంత మొత్తం ఆదాయం రాలేదని చెప్పారు. గత ఏడాది రాఖీ పండుగకు ప్రయాణికుల నుంచి వచ్చిన స్పందనకు దృష్టిలో ఉంచుకుని, ఈ ఏడాది ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందిగా చర్యలు తీసుకున్నామని, రాష్ట్రవాప్తంగా 3 వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రయాణికుల ఆదరణ, ఉద్యోగుల సమిష్టి కృషితో పాటు అధికారుల పక్కా ప్రణాళిక వల్ల రికార్డు స్థాయిలో ఆదాయం సంస్థకు సమకూరిందన్నారు. సంస్థ తీసుకువచ్చిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలు మంచిగా ఆదరిస్తున్నారని, ఆర్టీసీ వెంటే తామున్నామని నిరూపిస్తున్నారని వివరించారు. పండుగల రోజుల్లో సిబ్బంది త్యాగం చేస్తూ సేవలు అందిస్తున్నారని, వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాఖీ పౌర్ణమి లక్కీ డ్రా స్పూర్తితో ఇక నుంచి ప్రతి దసరా, సంక్రాంతి, ఉగాది పండుగలకు లక్కీ డ్రాలు నిర్వహించి.. విజేతలను ఎంపిక చేసి వారిని ఘనంగా సన్మానిస్తామని పేర్కొన్నారు. తమ బస్సుల్లో ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకునే ప్రయాణికులకూ ప్రతి నెల లక్కీ డ్రా నిర్వహించాలని టీఎస్ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించిందని తెలిపారు. గత రెండేళ్లలో టీఎస్ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ప్రయాణికులే కేంద్రంగా అనేక కార్యక్రమాలు తీసుకురావడం జరిగిందని చెప్పారు. త్వరలోనే మరో 1000 బస్సులను సంస్థ కొనుగోలు చేస్తోందని తెలిపారు. ఈ ఏడాది నవంబర్, డిసెంబర్ కల్లా ప్రజలకు కొత్త బస్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రస్తుతం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో మహిళా ప్రయాణికుల సౌకర్యార్థం ఇప్పటికే 8 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే, హైదరాబాద్ నగరంలో ప్రత్యేకంగా మహిళల కోసం మరో నాలుగు రూట్లలో (113 జెడ్/ఎం, 222ఏ, 9 ఎక్స్/272, 9 వై/ఎఫ్) లేడీస్ స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించినట్లు తెలిపారు. మెరుగైన రవాణా సేవల్ని అందిస్తున్న సంస్థగా టీఎస్ఆర్టీసీ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొంది ఉందని, అందరి సహకారంతోనే ఇది సాధ్యమైందని తెలిపారు.



## టీఎస్ఆర్టీసీ సేవలు భేష్

లక్కీ డ్రాలో గెలుపొంది నగదు పురస్కారాలు అందుకున్న మహిళా ప్రయాణికులు, వారి కుటుంబ సభ్యులు ఆర్టీసీ బస్సుతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఎన్నో ఏళ్లుగా తమ దైనందిన జీవనంలో బస్సు భాగమైందని, బస్సుల్లోనే ప్రయాణిస్తూ ఉన్నతస్థానాలకు చేరుకున్నట్లు తమ అభిప్రాయాలను వ్యక్త పరిచారు. క్షేమంగా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తున్న టీఎస్ఆర్టీసీ సేవల్ని ఎప్పటికీ మరచిపోలేమని కొనియాడారు. ప్రైవేట్ వాహనాలలో వెళ్లడం అంత సురక్షితం కాదంటూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం తమకు ఎంతో ఆనందాన్ని కల్గిస్తుందంటూ పలువురు విజేతలు స్పందించారు. అన్ని రీజియన్ల నుంచి తమ కుటుంబ సభ్యులతో ఎంతో ఉత్సాహంగా విచ్చేసిన విజేతలు నగదు పురస్కారాలను స్వీకరించి టి.ఎస్.ఆర్టీసీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ లక్కీ డ్రాలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 7వ తరగతి విద్యార్థిని కె. ప్రాంజల్ ద్వితీయ నగదు బహుమతి గెలుపొందడం విశేషం. తన తమ్ముడికి రాఖీ కట్టేందుకు గుడిహత్నూరకు బస్సులో ప్రయాణించిన ఆ బాలిక.. లక్కీ డ్రా సదుపాయాన్ని వినియోగించుకుంది. చిన్నతనంలోనే నగదు పురస్కారం అందుకోవడం పట్ల ఆ చిన్నారిని సంస్థ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. ఉన్నతస్థాయిలో ఉన్న వారు సైతం తమ జీవితంలో ఆర్టీసీ బస్సు సేవలను వినియోగించుకున్నారని పేర్కొంటూ.. బాలిక ఆ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వి.రవిందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వెంకటేశ్వర్లు, సీటీఎం జీవన ప్రసాద్, సీఈఐటీ రాజశేఖర్, సీఎఫ్ఎం విజయపుష్ప, రంగారెడ్డి, సికింద్రాబాద్, హైదరాబాద్ ఆర్ఎంలు శ్రీధర్, ఖుస్రోషా ఖాన్, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



# యువతి వివాహానికి బిఎల్ఆర్ ఆర్థిక సహాయం

**జయభేరి, కాప్రా :**

మీర్ పేట్ HB కాలనీ డివిజన్ కీ చెందిన రూప వివాహానికి ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా,సామజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ HB కాలనీ డివిజన్ ప్రెసిడెంట్ పర్విన, బాగ్యమ్మ , జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



**పంజాగుట్ట వద్ద మెడిసిన్ ఫార్మా మాల్ నీ తెలంగాణ రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ IPS VB కమలహాసన్ రెడ్డి తో కలిసి ప్రారంభించిన ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో ఫార్మల్ నిర్వహకులు ఆరుగొండ శ్రీధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.**

**- జయభేరి, ఉప్పల్**

# 5089 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 8**

నిరుద్యోగులు కల ఎట్టకేలకు నెరవేరింది. తెలంగాణలో 5089 టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. సెప్టెంబర్ 20 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 21 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుంది. నవంబర్ 20 నుంచి 30 వరకు తెలంగాణ డీఎస్సీ పరీక్ష2023 జరుగుతుంది. పశ్నాపత్రాల లీకేజీ లేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేందుకు ఆన్ లైన్ లో TRT పరీక్షలు జరపనున్నారు.ఈ క్రమంలో నోటిఫికేషన్ విడుదలపై తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులు విద్యాశాఖపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 6నే నోటిఫికేషన్ ఇచ్చిన విద్యాశాఖ బయట పెట్టకుండా జాప్యం చేసింది. టీచర్ నియామక నోటిఫికేషన్ విడుదల లోనూ విద్యాశాఖ అధికారుల మొద్దు నిద్రపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలు ఎలాగూ సవ్యంగా నిర్వహించడం చేతకాదు కనీసం నోటిఫికేషన్ అయినా సకాలంలో ఇవ్వలేరా అంటూ నిరుద్యోగులు మండిపడుతున్నారు. మరికొందరేమో నోటిఫికేషన్ విడుదల చేయడానికే బద్ధకించారు.. వీళ్ళా ఎగ్జామ్ నిర్వహణ చేసేది అంటూ ఫైర్ అయ్యారు. మొత్తం పోస్టుల్లో 2,575 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు, 1739 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 611 భాషా పండితులు పోస్టులు, 164 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులున్నాయి. వీటన్నింటినీ డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. బీఈడీ, డీఈడీ, బీపీఈడీలో ఉత్తీర్ణత పొందినవారు ఎవరైనా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే టెట్ పరీక్షలోనూ అర్హత సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 18 నుంచి 44 ఏండ్ల లోపు ఉండాలి.ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో అక్టోబర్ 21, 2023వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు కింద ప్రతిఒక్కరూ రూ.1000 చెల్లించాలి.

# పరీక్షల్లో చీటి ఇవ్వలేదని దాడి

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 9**

సాధారణంగా స్నేహితులు అంటే ఒకరికొకరు సాయం చేసుకుంటారు. ప్రాణ మిత్రులు అయితే ప్రాణ త్యాగాలు కూడా చేసుకుంటారు. మరీ పెద్ద, పెద్ద విషయాలు అయితే తప్ప గొడవ పడరు. ఒకవేళ పడినా మళ్లీ తమను తామే సమాధాన పరుచుకుంటారు. కానీ ఓ ఘటనలో మాత్రం ఇద్దరు స్నేహితులు.. చిన్న దాని కోసమే చితక్కొట్టుకున్నారు. ఈ దారుణ ఘటన హైదరాబాద్ నగరంలో జరిగింది. పాతబస్తీ పరిధిలో విద్యార్థులు తీవ్రంగా కొట్టుకున్నారు. ఒక విద్యార్థి మరో విద్యార్థిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కింద పడేసి పిడిగుద్దులు కురిపించాడు. ఆ విద్యార్థి దాడికి తాళలేక బాధిత స్టూడెంట్ అక్కడే కుప్పకూలిపోగా.. తోటి విద్యార్థులు అతడిని ఆస్పత్రికి తరలించారు. పాతబస్తీ ఛాదర్‌ఘాట్ పరిధిలో నివాసం ఉండే కసబ్, ఆరిఫ్ అనే విద్యార్థులు ఇద్దరు స్నేహితులు, ఇద్దరూ ఒకే కాలేజీలో చదువుతున్నారు. ఎస్ఐఎస్ వొకేషనల్ జూనియర్ కాలేజీలో ఆరిఫ్, కసబ్ సహ విద్యార్థులు కూడా. ఇద్దరూ మంచి స్నేహితులు. కాగా, ప్రస్తుతం కాలేజీలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలే ఆ ఇద్దరు స్నేహితుల మధ్య కలహానికి దారి తీశాయి. ఆరిఫ్, కసబ్ ఇద్దరూ పరీక్ష రాస్తున్న సమయంలో కసబ్.. ఆరిఫ్ నుంచి చీటి అడిగాడు. అయితే, ఆరిఫ్ చీటి ఇవ్వకపోవడంతో పరీక్ష హాలులోనే కసబ్ కోపంతో ఊగిపోయాడు. పరీక్ష అయిపోయాక నీ సంగతి చూస్తా అనుకున్నాడు. పరీక్ష అయిపోగానే విద్యార్థులు అంతా పార్కింగ్ సెల్లార్ లో కలుసుకున్నారు. ఈ క్రమంలో పరీక్ష సమయంలో తనకు చీటి అందించకపోవడంపై కసబ్.. ఆరిఫ్ ను నిలదీశాడు. ఈ క్రమంలోనే వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. అప్పటికే ఆవేశంతో ఊగిపోతున్న కసబ్.. ఆరిఫ్ పై దాడికి తెగబడ్డాడు. స్నేహితుడు అని కూడా చూడకుండా విచక్షణ రహితంగా కొట్టాడు. ఆరిఫ్ ను బలంగా కింద పడేసి ముఖంపై, తలపై పిడిగుద్దులు కురిపించాడు. కసబ్ దాడికి తాళలేక ఆరిఫ్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తోటి విద్యార్థులు కసబ్ ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. రక్తమోడుతున్న ఆరిఫ్ ను నడవలేని స్థితిలో అక్కడి నుంచి విద్యార్థులు మోసుకెళ్లారు. స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. అయితే కసబ్ తీవ్రంగా కొట్టడంతో.. ఆరిఫ్ మెదడులో రక్తం గడ్డకట్టిందని, ప్రస్తుతం ఆరిఫ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు ఆరిఫ్ తల్లిదండ్రులు పోలీసులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఛాదర్ ఘాట్ పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. కాలేజీ పార్కింగ్ సెల్లార్ లో ఉన్న సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన ఫుటేజీని సేకరించారు. ఇందులో ఆరిఫ్ ను కసబ్ మీద పడి కొడుతున్న దృశ్యాలన్నీ రికార్డు అయ్యాయి. ఈ ఫుటేజి ఆధారంగా చేసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు.

# చిల్కానగర్ నుండి సికింద్రాబాద్ స్టేషన్ కు బస్ ఏర్పాటు చేయాలి

**జయభేరి, ఉప్పల్ :**

చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బనాల గీత ప్రవీణ్ ముదిరాజ్ బండ్లగూడ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ రమేష్ కి చిల్కానగర్ చౌరస్తా నుండి సికింద్రాబాద్ స్టేషన్ వరకు బస్సు సర్వీస్ nu ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కార్పొరేటర్ గీత ప్రవీణ్ మాట్లాడుతూ...చిల్కానగర్ చౌరస్తానుండి సికింద్రాబాద్ వెళ్లడానికి నూతన బస్సు సర్వీస్ను ఏర్పాటు చేయాలని ప్రతిరోజు స్కూల్ పిల్లలకు, కాలేజీకి వెళ్లే పిల్లలకు, ఉద్యోగాలకు వెళ్లే ప్రజలకు చాలా ఇబ్బందికరంగా ఉందని వెంటనే చిల్కానగర్ చౌరస్తా నుండి సికింద్రాబాద్ కు కొత్త సర్వీస్ను ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. డిపో మేనేజర్ రమేష్ సానుకూలంగా స్పందిస్తూ వెంటనే కొత్త సర్వీస్ చిలుక నగర్ నుండి సికింద్రాబాద్ కు ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, రామాంజనేయులు, ముద్దం శ్రీనివాస్ యాదవ్, సరిత, శైనాజ్ మొదలగువారు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్యదర్శుల కు శిక్షణ

**జయభేరి, బాపట్ల :**

స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం నందు నిర్వహించబడుతున్న గ్రేడ్ వన్ గ్రేట్ పంచాయతీ కార్యదర్శుల శిక్షణ భాగంగా మూడు జిల్లాల నుండి వచ్చిన 200లకు పైగా పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి శుక్రవారం డైరెక్టర్ ఏపీ ఎస్సైఆర్డి పి ఆర్ జె. మురళి ఐఏఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ... పంచాయతీ అభివృద్ధి, సూచిక తయారీ, శిక్షణ అభివృద్ధి లక్ష్యాలు 9 థీములు ఇండికేటర్స్ గురించి వివరించారు. పంచాయతీ కార్యదర్శులకు నమూనా నిర్మాణము టీం వర్క్స గురించి చిన్న ఆక్టివిటీ ద్వారా వివరించారు. సచివాలయంలోని సిబ్బంది వాలంటీర్లతో కలిసి సమన్వయంతో పనిచేసుకునేలా ప్రభుత్వం పంచాయితీ సంక్షేమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అధికారం, సామర్థ్యమును కలిపి ఎలా వినియోగించుకోవాలో తద్వారా ప్రజల మన్నలను పొందగడుగుతారని తెలియజేశారు. గ్రామపంచాయతీ పరిపాలనలో సాధారణంగా ఎదురయ్యే ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో ఎలా జాగ్రత్తగా ప్రణాళిక బద్ధంగా చట్ట ప్రకారం బాధితులకు సత్వర న్యాయం, పునరావాస ప్రణాళిక విషయంలో పొగడ్బందీ చర్యలను సాధారణంగా రెవిన్యూ ఉన్నతాధికారిగా తమ అనుభవాలు వివరించారు. పరిపాలనలో సహజంగా ఉద్యోగస్తులు ఒత్తిడికి గురవుతారు. ఒత్తిడి లక్షణాలు, ఒత్తిడి స్కిల్ ను కొన్ని ప్రశ్నల ద్వారా తెలియజేశారు. హృదయం శరీరంలోని వివిధ అంశాలను ఎలా ప్రభావితం చేస్తుందో వివరించారు. మనసు సాఫ్ట్వేర్, మెదడు హార్డ్వేర్ కానీ చెప్పిన మాటలు శిక్షకులను ఆకర్షించే విధంగా ప్రసంగించారు. శరీరంలో హార్మోన్ల సమతుల్యత గురించి, శాస్త్రీయంగా కేంద్రీకరణ ద్వారా ఏకాగ్రతను పెంపొందించుకునేలా ప్రక్రియను వివరించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరెడ్డి, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన ఎంఓటీలు ఒకటి నుంచి ఐదు గ్రేడ్ల పంచాయతీ కార్యదర్శులు, డి ఏ లు, గుంటూరు జిల్లాకు చెందిన హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ సభ్యులు, ఈటిసి సిబ్బంది పాల్గొన్నారు.



# పారిశ్రామిక జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్ జీఓ విడుదల

**జయభేరి, కాప్రా :**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో కాలనీలను పారిశ్రామిక జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్ గా మారుస్తూ శుక్రవారం ప్రభుత్వం జీ.ఓ. విడుదల చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించారు. ఈ జోన్ల సమస్య వల్ల ఆయా కాలనీల నివాసం వుండే ప్రజలకు ఈన్నేళ్ళుగా ఇంటి అనుమతులు, బ్యాంకు రుణాలు రాక అనేక సాంకేతికమైన సమస్యలను ఎదుర్కొనారు, ప్రభుత్వం కూడా ఎంతో ఆదాయం కోల్పోయింది. ఈ జీ.ఓ. వలన ఈ కాలనీ వాసుల సమస్యలకు పరిష్కారం జరుగుతుంది.







# పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో ప్రాసెసింగ్ చేయాలి

**జయభేరి, ఉప్పల్ :**

యూని ప్లానెట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ని ప్రారంభించిన బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డి. రామంతాపూర్ ఇంద్ర ఇంపరియా బిల్డింగ్ లో ప్రొప్రియేటర్ పెట్లోళ్ల లక్ష్మికాంత్ రెడ్డి, భారత్ రెడ్డి ఏర్పాటుచేసిన యూని ప్లానెట్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ని చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి ప్రారంభించిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డి. వారు మాట్లాడుతూ... పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో ప్రాసెసింగ్ చేయాలని, అదేవిధంగా నిరుపేద విద్యార్థులు ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కి వెళ్లే వారికి తన వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తానని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంధం నాగేశ్వరరావు, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సిద్ధి మహేందర్ గుప్తా, సూరం శంకర్, బోసాని పవన్ కుమార్, విద్యార్థి నాయకుడు ప్రశాంత్ గౌడ్ మొదలగువారు పాల్గొన్నారు.




# గ్రంధాలయ అభివృద్ధి పనుల కు శంకుస్థాపన

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా గ్రంధాలయం లో మంత్రి చామకూర మల్లారెడ్డి గ్రంధాలయ అభివృద్ధి పనుల కోసం రూ. 1కోటి శంకుస్థాపన చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్ రెడ్డి, రైతు సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షలు నారెడ్డి నందారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దీపిక నర్సింహ రెడ్డీ, వైస్ చైర్మన్, కౌన్సిలర్ లు పార్టీ అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జయభేరి సినిమా



# 'చంద్రముఖి 2' 28న రిలీజ్

స్టార్ కొరియోగ్రాఫర్, యాక్టర్, ప్రొడ్యూసర్, డైరెక్టర్ రాఘవ లారెన్స్ హీరోగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్ టైటిల్ పాత్రలో నటించిన భారీ బడ్జెట్ మూవీ 'చంద్రముఖి 2'. అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తోన్న ఈ చిత్రాన్ని సీనియర్ డైరెక్టర్ పి.వాసు తెరకెక్కిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా మూవీగా సెప్టెంబర్ 28న విడుదలవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో 'చంద్రముఖి 2' చిత్రాన్ని రాధాకృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ ఉప్పుటూరి, వెంకట రత్నం శాఖమూరి రిలీజ్ చేస్తున్నారు. ముందుగా 'చంద్రముఖి 2' సినిమాను ముందుగా సెప్టెంబర్ 15న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటన చేశారు. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో సినిమాను సెప్టెంబర్ 15న విడుదల చేయటం లేదని, సెప్టెంబర్ 28న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ తెలియజేస్తూ ఓ వీడియోను విడుదల చేశారు. రీసెంట్‌గా రిలీజైన 'చంద్రముఖి 2' ట్రైలర్ సినిమాపై ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్‌ను నెక్స్ట్ రేంజ్‌కి తీసుకెళ్లింది. 17 సంవత్సరాల క్రితం లక లక అంటూ చంద్రముఖి తన బందీగా ఉంటున్న గది తలుపులు తెరుచుకుని వేట్టయ రాజాపై పగ తీర్చుకోవటానికి ప్రయత్నించి విఫలమైంది. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు తన పగ తీర్చుకోవటానికి చంద్రముఖి మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఓ వైపు హారర్, మరో వైపు కామెడీ ఎలిమెంట్స్‌తో చంద్రముఖి 2 అలరించనుందని ట్రైలర్‌లో స్పష్టమైంది. చంద్రముఖిగా కంగనా రనౌత్ మెప్పించనుండగా.. ఓ వైపు స్టైలిష్ లుక్, మరోవైపు వేట్టయ రాజాగా రాఘవ లారెన్స్ అలరించబోతున్నారు. వడివేలు తనదైన కామెడీతో మరోసారి నవ్వుల విందుని అందించబోతున్నారు.

నటీనటులు: రాఘవ లారెన్స్, కంగనా రనౌత్, వడివేలు, లక్ష్మీ మీనన్, మహిమా నంబియార్, రాధికా శరత్ కుమార్, విఘ్నేష్, రవిమారియ, శృష్టి డాంగే, శుభిక్ష, వై.జి.మహేంద్రన్ రావు రమేష్, సాయి అయ్యప్పన్, సురేష్ మీనన్, శత్రు, టి.ఎం.కార్తీక్




# 'రూల్స్ రంజన్' వంద శాతం వినోదం

సుప్రసిద్ధ నిర్మాత ఏ.ఎం. రత్నం సమర్పణలో స్టార్ లైట్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై దివ్యాంగ్ లవానియా, మురళి కృష్ణ వేమూరి నిర్మిస్తున్న చిత్రం 'రూల్స్ రంజన్'. కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి రత్నం కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. రింకు కుక్రెజ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అమ్రిష్ గణేష్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పాటలకు, ప్రచార చిత్రాలను అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా సినిమా ట్రైలర్ ను విడుదల చేసింది చిత్ర బృందం. 'రూల్స్ రంజన్' ట్రైలర్ ను సెప్టెంబర్ 8 ఉదయం 11:22 గంటలకు విడుదల చేశారు. ట్రైలర్ ఆద్యంతం వినోద భరితంగా సాగింది. తండ్రి పాత్రధారి గోపరాజు రమణ "ప్రతి తండ్రి నన్ను చూసి నేర్చుకోవాల. అమ్మ పాలిచ్చి పెంచుద్ది, అయ్య మందిచ్చి ఓదార్చాల. చెప్పు నాన్న ఏం తాగుతావు?" అని అడగగా.. కథానాయకుడు కిరణ్ అబ్బవరం "బీర్ ఓకే" అని చెప్పే సంభాషణతో ట్రైలర్ సరదాగా ప్రారంభమైంది. "సన్నీ లియోన్ హస్బెండ్ నాకు ఇన్ స్పిరేషన్", "పెళ్ళయితే మీ పెళ్ళాలకు ప్రెగ్నెన్సీ రావాల్సింది, మీకు వచ్చింది ఏంటి?" వంటి వరుస మాటల తూటాలతో 100 శాతం వినోదం గ్యారెంటీ అనే నమ్మకం కలిగిస్తోంది. నాయకానాయికల మధ్య సన్నివేశాలు కూడా హాస్యంతో కూడి మెప్పిస్తున్నాయి. కలిసి కాలేజ్ లో చదువుకున్న వారు చాలాకాలం తరువాత కలవడం, సనా(నేహా)ని మెప్పించడానికి రూల్స్ రంజన్ లా ఉండే మనో రంజన్ కాస్తా పబ్ రంజన్ గా మారడం వంటి సన్నివేశాలతో ట్రైలర్ ఆసక్తికరంగా సాగింది. అసలు రూల్స్ రంజన్, పబ్ రంజన్ గా ఎందుకు మారాడు? మందు వల్ల అతని ప్రేమకి, స్నేహానికి వచ్చిన సమస్య ఏంటి? అతని ప్రేమ ఫలించిందా? అనే ఉత్కంఠను రేకెత్తిస్తూ సినిమా చూడాలనే ఆసక్తిని రెట్టింపు చేస్తోంది ట్రైలర్. అమ్రిష్ గణేష్ పాటలలోనే కాదు నేపథ్య సంగీతంలో కూడా తన ప్రతిభ కనబరుస్తున్నారు. అలాగే ట్రైలర్ లో విజువల్స్, నిర్మాణ విలువలు బాగున్నాయి. పూర్తి స్థాయి వినోద భరితంగా రూపొందుతోన్న ఈ చిత్రం సెప్టెంబర్ 28న థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల కానుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ గా దులీప్ కుమార్, ఆర్ట్ డైరెక్టర్ గా ఎం. సుధీర్ వ్యవహరిస్తున్నారు.



# డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో అతిథి

టాలెంటెడ్ యాక్టర్ వేణు తొట్టెంపూడి డిజిటల్ ఎంట్రీ ఇస్తున్న వెబ్ సిరీస్ "అతిథి". ప్రముఖ ఓటీటీ కంపెనీ డిస్నీ ప్లస్ హాట్ స్టార్ స్పెషల్స్ గా ఈ వెబ్ సిరీస్ రాబోతోంది. "అతిథి" వెబ్ సిరీస్ ను రాండమ్ ఫ్రేమ్స్ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్ పై దర్శకుడు భరత్ వైజీ రూపొందిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు ప్రవీణ్ సత్తారు షో రన్నర్ గా వ్యవహరిస్తున్నారు. ఇవాళ "అతిథి" వెబ్ సిరీస్ ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్ చూస్తే...ఒంటరిగా పెద్ద భవంతిలో ఉంటున్న వేణుకు దెయ్యాలంటే నమ్మకం ఉండదు. ఎక్కడో ఒక ఆడది దెయ్యంగా మారిందని, అమ్మాయిలందరూ దెయ్యలంటే ఎలా అని అడుగుతాడు. మీ ఇంట్లో ఉన్నది మనిషి కాదు దెయ్యం అని తన మిత్రుడు చెప్పినా నమ్మడు. కానీ ఆ అమ్మాయి వింతగా ప్రవర్తిస్తుంటుంది. ఇంతకీ ఆమె ఎవరు?, మనిషా, దెయ్యామా? అనేది సిరీస్ లో చూడాలి. మేకింగ్ క్వాలిటీ, యాక్టర్స్ పర్ ఫార్మెన్స్, ట్రైలర్ లో ట్విస్ట్ లు ఆకట్టుకునేలా ఉన్నాయి. కొన్ని కథలు మొదలుపెట్టడం సులువు, ముగించడం కష్టం, కథలకు ముగింపు ఇద్దామా అనే డైలాగ్స్ "అతిథి" పై ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. డిస్నీ ప్లస్ హాట్ స్టార్. ఈ నెల 19 నుంచి "అతిథి" వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ఇటీవల డిస్నీ ప్లస్ హాట్ స్టార్ నుంచి వచ్చిన సేవ్ ది టైగర్స్, సైతాన్, దయ వంటి సిరీస్ లు సూపర్ హిట్స్ అయ్యాయి. ఈ నేపథ్యంలో "అతిథి"పై ప్రేక్షకుల్లో మంచి ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి.



# కోటబొమ్మాలి పిఎస్ శ్రీకాకుళం ఫోక్ సాంగ్

తెలుగులో అనేక సినిమాలు నిర్మించి సూపర్ హిట్లు, బ్లాక్ బస్టర్లు అందుకుంది గీతా ఆర్ట్స్ 2 సంస్థ. GA2 పిక్చర్స్ బ్యానర్ ద్వారా భలే భలే మగాడివోయ్, గీత గోవిందం, టాక్సీవాలా, ప్రతి రోజు పండగే, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ లాంటి సినిమాలు నిర్మించగా కొన్ని ఇతర భాషలు సినిమాలను కూడా తెలుగులో రిలీజ్ చేసి సక్సెస్ లనుఅందుకున్నారు. తాజాగా మలయాళ సూపర్ హిట్ నాయాట్టు కి రీమేక్ గా కోట బొమ్మాళి పిఎస్ పేరుతో తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సినిమాకి నిర్మాతలుగా బన్నీ వాస్, విద్యా కొప్పినీడి వ్యవహరిస్తున్నారు. శ్రీకాంత్ మేక ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రత్యేక పాత్రలో నటిస్తోంది. రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన మోషన్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ఇప్పుడు కోట బొమ్మాళి PS మ్యూజిక్ ప్రమోషన్లను ప్రారంభించారు మేకర్స్. మాస్సీ శ్రీకాకుళం ఫోక్లోర్ ఫస్ట్ సింగిల్ సెప్టెంబర్ 11న విడుదలవుతుందని ఈరోజు ప్రకటించారు. ఇంట్రెస్టింగ్ పోస్టర్‌తో ఈ అప్డేట్ అందించారు. పూర్తిస్థాయి ఫోక్ సాంగ్ తో రానున్న ఈ పాట ప్రేక్షకుల్ని అలరిస్తుందని అన్నారు దర్శకర్మాతలు. జోహార్, అర్జున ఫాల్గుణ వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపునందుకున్న తేజ మార్ని ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు.

# వైరల్ అవుతోన్న సౌండ్ పార్టీ సాంగ్

ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం 1గా రూపొందుతోన్న చిత్రం `సౌండ్ పార్టీ`. వీజే సన్నీ, హ్రితిక శ్రీనివాస్ జంటగా నటిస్తున్నారు. రవి పోలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మాతలు. జయ శంకర్ సమర్పణ. సంజయ్ శేరి దర్శకుడు. ఈ చిత్రం టీజర్ ఇప్పటికే విడుదలై టాలీవుడ్ లో గట్టిగానే సౌండ్ చేసింది. ఇక ఇటీవల ఈ చిత్రం నుండి `మని మని మని మనీ దీని ముఖములు సోమెనీ` అనే లిరికల్ వీడియో సాంగ్ లాంచ్ చేశారు. ప్రజంట్ ఈ సాంగ్ యూట్యూబ్ లో వైరల్ అవుతోంది. డబ్బు ప్రాధాన్యత గురించి యువ రచయిత పూర్ణచారి ప్రజంట్ ట్రెండ్ కి కనెక్టయ్యే విధంగా పాట రాయగా మోహిత్ రెహమానిక్ దానికి తగ్గట్టుగా మాంచి బీట్ తో కంపోజ్ చేశారు. యూట్యూబ్ లో వైరల్ అవుతోన్న ఈ సాంగ్ మంచి వ్యూస్ తో రీల్స్ తో హల్ చల్ చేస్తోంది. ఫస్ట్ లిరికల్ తోనే మంచి బజ్ క్రియేట్ చేసిన `సౌండ్ పార్టీ` చిత్రం ఇటు ఇండస్ట్రీలో అటు ఆడియన్స్ లో రీ సౌండ్ సృష్టించడం ఖాయం అనడంలో సందేహం లేదు. శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుంటోన్న ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ అధినేత రవి పోలిశెట్టి మాట్లాడుతూ...``ఎప్పుడైతే మా `సౌండ్ పార్టీ` చిత్రం టీజర్ విడుదలైందో అప్పటి నుంచి మా `సౌండ్ పార్టీ` చిత్రానికి మంచి మంచి బజ్ వచ్చింది. ముఖ్యంగా టీజర్ లో వీజే సన్నీ, శివన్నారాయణ చెప్పిన డైలాగ్స్ తో సినిమాలో ఎలాంటి హ్యూమర్ ఉండబోతుందో అర్థమవుతోంది. ఇక ఇటీవల రిలీజ్ అయిన `సౌండ్ పార్టీ` టైటిల్ ట్రాక్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. ప్రస్తుతం పాటలు సినిమాకు ఎంత ప్లస్ అవుతున్నాయో, సినిమాను పబ్లిక్ లోకి ఏ విధంగా తీసుకెళ్తున్నాయో చూస్తున్నాం. ఈ తరుణంలో మా సినిమా నుండి రిలీజైన ఫస్ట్ లిరికల్ సాంగ్ కి మంచి రెస్పాన్స్ రావడం ఎంతో సంతోషంగా ఉంది. త్వరలో మిగతా పాటలు రిలీజ్ చేయనున్నాం. మా సంగీత దర్శకుడు మోహిత్ రెహమానిక్ అద్భుతమైన పాటలతో పాటు సినిమాను నెక్స్ట్ లెవల్ కు తీసుకెళ్లే విధంగా బ్యాక్ గ్రౌండ్ స్కోరు చేశారు. అలాగే సమర్పకుడు జయ శంకర్ , దర్శకుడు సంజయ్ శేరి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేస్తున్నారు. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం`` అన్నారు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.

Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com